



డిజైన్‌లో మార్పుచేయాలని కోరుతున్న వ్యవసాయ సంఘ నాయకులు (ఫైల్)

ఇక సమరమే..

● పూర్తయిన నామినేషన్ల ఘట్టం


● ఎన్నికల బరిలో అసెంబ్లీకి 77.. ఎంపీకి 15మంది

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగియడంతో ఇక అసలు సమరం మొదలుకానుంది. బరిలో ఎవరు ఉన్నదీ తేలిపోయింది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను జిల్లా ఎన్నికల అధికారి సోమవారం విడుదల చేశారు. విజయనగరం పార్లమెంట్‌కు 15మంది బరిలో ఉన్నారు. అలాగే అసెంబ్లీ సెగ్మెంట్లలో అత్యధికంగా విజయనగరంలో 15 మంది పోటీలో ఉన్నారు. గజపతినగరం 13మంది, ఎస్.కోట, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో 12మంది చొప్పున పోటీలో ఉన్నారు. రాజాంలో 10మంది, బొబ్బిలిలో 8, అతి తక్కువగా చీపురుపల్లి నియోజకవర్గంలో ఏడుగురు పోటీలో ఉన్నారు. కాగా సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ముగిసే సమయానికి ఆరుగురు విత్‌డ్రా అయ్యారు. విజయనగరం నుంచి ఒకరు, ఎస్.కోట 2, నెల్లిమర్ల 1, చీపురుపల్లి 1, బొబ్బిలిలో ఒకరు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

● స్వతంత్ర అభ్యర్థులకు గాజుగ్లాసు గుర్తు కేటాయించడంపై కూటమి నేతలు అభ్యంతరం తెలియజేస్తున్నారు. దీనిపై పునరాలోచించాలని ఈసీని కోరుతున్నారు. జనసేన గుర్తు కూడా గాజుగ్లాసు కావడం వల్ల స్వతంత్ర అభ్యర్థులు జనసేన పార్టీ వారిగా ఓటర్లు పొరబడే ప్రమాదం ఉందంటున్నారు.

ప్రధాన పార్టీల ఎంపీ(విజయనగరం) అభ్యర్థులు



టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
కలిశెట్టి అప్పలనాయుడు	బెల్లాన చంద్రశేఖర్	బొబ్బిలి శ్రీను

ప్రధాన పార్టీల అసెంబ్లీ అభ్యర్థులు















	టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్
విజయనగరం	అదితి విజయలక్ష్మి	కోలగట్ల వీరభద్రస్వామి	సుంకరి సతీష్‌కుమార్
చీపురుపల్లి	కిమిడి కళావెంకట్రావు	బొత్స సత్యనారాయణ	జమ్ము ఆదినారాయణ
గజపతినగరం	కొండపల్లి శ్రీనివాస్	బొత్స అప్పలనరసయ్య	డోలా శ్రీనివాస్
నెల్లిమర్ల	లోకం నాగమాధవి(జనసేన)	బడ్డుకొండ అప్పలనాయుడు	సరగడ రమేష్‌కుమార్
రాజాం	కోండ్రు మురళీమోహన్	డాక్టర్ తలే రాజేష్	కంబాల రాజవర్ధన్
బొబ్బిలి	ఆర్‌వీఎస్‌కేకే రంగారావు	శంబంగి వెంకట చినప్పలనాయుడు	మరిపి విద్యాసాగర్
ఎస్.కోట	కోళ్ల లలితకుమారి	కడుబండి శ్రీనివాసరావు	గేదెల తిరుపతి





రంగుపురంలో పోలవరం కెనాల్ సర్వే చేపట్టిన భూమి

భూ సేకరణే కాలేదు..

పనులెప్పుడో

● ఐదేళ్లయినా జోరందుకోని సుజల స్రవంతి ప్రాజెక్టు

● పూర్తయితే 4 లక్షల ఎకరాలకు సాగునీరు

● నేతలకు అనుకూలంగా కాలువ అలైన్‌మెంట్

● అభ్యంతరం చెబుతున్న రైతులు

● 2013 చట్టం అనుసరించి సర్వే చేయాలని డిమాండ్

బాబు జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు (పోలవరం ప్రధాన ఎడమ కాలువ) పనులే ప్రారంభం కాలేదు. ఈ ప్రభుత్వం గొప్ప ప్రాజెక్టు అంటూనే నిర్మాణంపై దృష్టిసారించలేదు. నాలుగేళ్లలో తప్పకుండా పూర్తి చేస్తామన్న సీఎం మడమ తిప్పేశారు. ప్రధానంగా రైతులు భూ సేకరణకు అభ్యంతరాలు వ్యక్తం చేసిన చోట్ల వారికి ప్రత్యామ్నాయం చూపడం లేదు. పైగా కాలువ ఎలైన్‌మెంట్‌ను కొన్నిచోట్ల నేతల భూములకు అనుగుణంగా మార్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. వారి భూములు కాలువలో కలిసిపోకుండా చూసుకున్నట్లు సమాచారం. అధికారులూ వారి మాటే వింటున్నారు. వెరసి 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు అయోమయంలో పడింది.

- గజపతినగరం

గోదావరి వరద జలాలను ఉత్తరాంధ్ర జిల్లాలకు తీసుకువెళ్లాలన్న లక్ష్యంతో సుజల స్రవంతి ప్రాజెక్టు తెరపైకి వచ్చింది. పోలవరం ఎడమ కాలువ నుంచి 63.2 టీఎంసీల నీటిని ఎత్తిపోసి.. మరికొంత నీటిని గ్రావిటీ ద్వారా తరలించి సాగు, తాగునీరుగా ఇవ్వాలని తలపెట్టారు. విజయనగరం జిల్లాలో 3లక్షల 94వేల ఎకరాలకు నీరందివ్వాలనుకున్నారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ (ఉత్తరాంధ్ర సుజల స్రవంతి) పనులు పూర్తయితే లక్షల ఎకరాల్లో సాగునీరు అందుతుందని చెప్పుకొచ్చిన పాలకులు నిర్మాణంపై కనీసం దృష్టిపెట్టలేదు. ఈ కాలువ జిల్లాలో కొత్తవలస, ఎల్.కోట, వేపాడ, ఎస్.కోట, గంట్యాడ, బొండపల్లి, గజపతినగరం, గుర్ల మండలాల వరకు వస్తుంది. ఈ క్రమంలో 58 గ్రామాలకు చెందిన సుమారు 4,500 ఎకరాలు అవసరం. రైతుల నుంచి భూమిని సేకరించేందుకు అధికారులు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ప్రతిచోటా రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. భూములను వదులుకునేందుకు ఇష్టపడడం లేదు. 'మా భూములు ఇవ్వబోమని, కాలువ అవసరం లేదని' ఖరాఖండిగా చెబుతున్నారు. అధికారులు మరో పర్యాయం గ్రామ సభ నిర్వహిస్తామని చెప్పి వెళ్లిపోతున్నారు. రైతులకు భరోసా ఇచ్చే ప్రత్యామ్నాయం చూపడం లేదు. అందుకే ఎక్కడా పనులు ప్రారంభం కాలేదు.

భూసేకరణ దశలోనే ప్రాజెక్టు మందగమనంలో పడింది. గజపతినగరం మండలానికి సంబంధించి డోలపాలెం, కేఎస్‌ఆర్ పురం, లింగాలవలస, రంగుపురం గ్రామాల్లో రైతులు అధికారులకు భూములిచ్చేది లేదని తేల్చిచెప్పేశారు. పోలవరం కెనాల్ డిజైన్‌లో మార్పులు చేయాలని చాలా మంది రైతులు కోరుతున్నారు. 2007లో ప్రతిపాదనలకు ప్రస్తుత ప్రతిపాదనలకు ఎంతో తేడా ఉందని రైతు సంఘం నాయకులు అంటున్నారు.

అధికార పార్టీ నేతల భూములకు ఎలాంటి ఇబ్బంది లేకుండా.. సెంటు భూమి కూడా కలవకుండా అధికారులు సహకరిస్తున్నారనేది వారి ప్రధాన అభియోగం. ఆయా నేతలు చెప్పినట్లు నడుచుకుంటూ డిజైన్ మార్చారని ఆరోపిస్తున్నారు. గంట్యాడ, కొత్తవలస, ఎస్.కోట ప్రాంతాల్లో ఇప్పటికే పలు ప్రాజెక్టులకు భూములు ఇచ్చి ఉన్నారు. దీంతో సుజలస్రవంతికి భూములు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. పైగా వారికి ప్రభుత్వం ఖచ్చితమైన భరోసా ఇవ్వడం లేదు.

గత ప్రభుత్వంలోనే పనులు ప్రారంభం

జిల్లాలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రధాన కాలువ గుండా విజయనగరం జిల్లాలో 3లక్షల 94వేల ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాలో 84వేల ఎకరాలకు నీరు, ప్రజలకు తాగునీరు, అలాగే పరిశ్రమలకు నీరు అందించాలన్న ఉద్దేశంతో 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాజెక్టును రూపొందించి మంజూరు చేశారు. అయితే ప్రాజెక్టు పనులు మొదలు కాలేదు. కొద్దినెలల విరామంలో వైఎస్ఆర్ మరణించడం.. ముఖ్యమంత్రులు మారడం.. ఉమ్మడి రాష్ట్రంలో నెలకొన్న అస్థిర పరిస్థితుల ప్రభావంతో ప్రాజెక్టుకు సంబంధించి ఎలాంటి కదలిక లేకపోయింది. 2017లో చంద్రబాబు ప్రభుత్వం ఫేజ్-1 కింద విశాఖ జిల్లాలో రూ.2200 కోట్లతో సుజలస్రవంతిలో కొంతభాగం మంజూరు చేసి పనులు ప్రారంభించారు. పనులు చురుగ్గా సాగుతున్న తరుణంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రాధాన్యం మారిపోయింది. మరోవైపు రైతులకు సరైన భరోసా ఇవ్వకపోవడంతో వారు భూములు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. ఇప్పటికే జిల్లాలో 45000 ఎకరాలు తోటపల్లి ప్రాజెక్టు కుడికాలువ లోను, తోటపల్లి గజపతినగరం బ్రాంచ్ కాలువలో 15000 ఎకరాలు, తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టుకు 22000ఎకరాలు, తాటిపూడి కింద 2000ఎకరాలు, ఆండ్ర జలాశయం కింద 9500ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేసి ఉంది. ఈ నేపథ్యంలో రైతులకు పెద్దగా నష్టం లేకుండా కాలువ డిజైన్ మారాలని రైతు సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

చట్టబద్ధత పాటించాలి..

పోలవరం కెనాల్ పనులకు సంబంధించి ప్రభుత్వం చట్టబద్ధత పాటించాలి. 2013 చట్టం అనుసరించి కాకుండా 2018 చట్టం ప్రకారం భూ సర్వే చేయడం సరికాదు. అధికారులతో కమిటీ వేసి రైతుల అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. డిజైన్‌లో మార్పుచేసి రైతులను ఆదుకోవాలి.

-రాంబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

పనులపై కాలయాపన..

పోలవరం కెనాల్ పనులకు సంబంధించి ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కాలయాపన చేసింది. ధనికుల భూములను వదిలి పేద రైతులను ఇబ్బందులకు గురి చేసేలా సర్వే చేపట్టింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎకరాలకు నీరు అందించాలన్నది మా డిమాండ్. భూముల సర్వే ఆ విధంగా జరగాలి.

-రాములు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి



ఎన్నికలను బహిష్కరిస్తున్నాం

● భోజురాజుపురం గ్రామస్థుల నిరసన

విజయనగరం, ఏప్రిల్ 29: గజపతినగరం నియోజకవర్గం దత్తిరాజేరు మండలంలోని భోజురాజుపురం గ్రామస్థులు ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. సోమవారం ఈ గ్రామస్థులు కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన తెలిపారు. గ్రామానికి వెళ్లేందుకు ఇప్పటికీ రోడ్డు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఎన్నికల్లోనూ నాయకులు హామీలిచ్చి తరువాత మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. గ్రామంలో 150 కుటుంబాల వరకూ నివాసం ఉంటున్నా తాగునీరు అందివ్వలేదన్నారు. ధర్నాలో కె.అప్పలనాయుడు, కె.లచ్చమ్మ, కోండ్రు అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేయండి

కలెక్టరేట్: సాధారణ ఎన్నికల విధుల్లో నియమితులైన వారు వచ్చేనెల ఒకటో తేదీలోగా తమ ప్రాంత తహసీల్దార్‌కు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులను అందజేయాల్సి ఉంటుందని కలెక్టర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అందరూ తక్షణం గమనించాలని కోరారు.

పోలింగ్ రోజున సెలవు

పార్లమెంట్, అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు పోలింగ్ జరిగే మే 13న సోమవారం జిల్లాలో స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

పింఛన్ కావాలంటే టెన్షనే



● జగన్ ప్రభుత్వంలో కొర్రీలు అధికం

విజయనగరం (ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 29 : పింఛన్‌దారులకు టీడీపీ హయాంలోనే మేలు జరిగిందని అవ్వతాతలు చెబుతున్నారు. జగన్ ప్రభుత్వంలో కొత్తగా పింఛను పొందాలంటే ఆరు నెలలు ఆగాలి. టీడీపీ హయాంలో తెల్లరేషన్ కార్డుతోపాటు వయసును బట్టి పింఛనుకు అర్హులుగా గుర్తించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. ఆధార్‌కార్డులో వయసు తక్కువగా నమోదైతే పింఛను రాదు. నిజానికి ఆధార్ కార్డులో తక్కువ ఉండి, సాధారణంగా వయసు ఎక్కువ ఉన్నవారికి మెడికల్ టెస్ట్‌లు చేసుకుని వయసు నిర్ధారించుకుంటే పింఛను మంజూరు చేస్తామని వైసీపీ నేతలు చెప్పుకొచ్చారు. దీంతో ఆశావహులు ప్రభుత్వ ఆసుపత్రుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగారు. కానీ చాలామందికి పింఛను రాలేదు. మొదట్లో ఒంటరి మహిళలకు 35 ఏళ్లకే పింఛను అందిస్తామని చెప్పుకొచ్చిన జగన్ సర్కార్ ఇప్పుడు 50 ఏళ్లు దాటాలని కొర్రీలు పెట్టింది. అలాగే వివిధ కారణాల వల్ల ఒక నెల పింఛను తీసుకోలేకపోతే మళ్లీ నెలలో తిరిగి వచ్చే పరిస్థితి లేదు. అదే టీడీపీ ప్రభుత్వ హయాంలో రెండు, మూడు నెలల పింఛను కూడా ఒకేసారి ఇచ్చేవారు. కొత్తగా పింఛన్ పెట్టుకున్న వారు అన్నీ అధారాలు ఇచ్చినా సచివాలయాల్లో ఏదో రకమైన కొర్రీపెట్టి నెలలు గడిపేస్తున్నారు. దీంతో మరో 6 నెలలు ఆగాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇదివరకు నెలనెల కొత్తపింఛన్‌లకు దరఖాస్తులు చేసుకునే వారు. జగన్ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు.

సూక్ష్మ పరిశీలకులు కీలకం

● జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్



కలెక్టరేట్, ఏప్రిల్ 29: ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులదే కీలక పాత్ర అని, నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ జరిగిందా? లేదా? అనే విషయాన్ని వీరు పరిశీలించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నిక సాధారణ పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా చెప్పారు. ఎన్నికల ప్రక్రియపై ఓటర్లలో నమ్మకాన్ని కల్పించాల్సిన బాధ్యత కూడా వీరిపై ఉందన్నారు. సూక్ష్మ పరిశీలకులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం మొదటి విడత శిక్షణ ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ సూక్ష్మ పరిశీలకుల విధులు, నిబంధలను వివరించారు. సున్నిత, అతి సున్నిత పోలింగ్, కేంద్రాల్లో సూక్ష్మ పరిశీలకులను నియమించామని, నిబంధనలకు అనుగుణంగా ఎన్నిక ప్రక్రియ జరిగిందా?లేదా అనే విషయాన్ని వీరు పరిశీలించా ల్సి ఉంటుందన్నారు. ఆయా చోట్ల అదనంగా వెబ్ కాస్టింగ్ తోపాటు వీడియో రికార్డింగ్ కూడా జరుగుతుందన్నారు. మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల రోజు తాము పరిశీలించిన విషయాన్ని రిపోర్టు రూపంలో అందజేయాల్సి ఉంటుంద న్నారు. వీరు ఇచ్చే రిపోర్టు ఎంతో కీలకమని చెప్పారు. ఒక్కోసారి రీపోలింగ్‌కు కూడా ఆదేశాలను జారీ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఎన్నిక మరునాడు జిల్లా పరిశీలకులు నిర్వహించే స్క్రూటినీలో సూక్ష్మ పరిశీలకుల రిపోర్టులు ఆధారంగానే నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. వీరు కూడా పోలింగ్ సిబ్బందితో పాటు ముందురోజు రాత్రే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు.

పీపుల్స్ మేనిఫెస్టో

భవిష్యత్‌కు భరోసా ఇవ్వాలి



గరుగుబిల్లి: భవిష్యత్‌కు భరోసా కల్పించే వారికే ప్రాధాన్యం ఇస్తాం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే నాయకుడికే మద్దతు ఉంటుంది. ఎన్నికల సమయంతో నేతల హామీలు కార్యరూపం దాల్చడం లేదు. ఓటు వేసేంత వరకు ఒకలా.. ఆ తరువాత మరొకలా వ్యవహరిస్తున్నారు. ప్రజా ఓట్లతో సమస్యలు పరిష్కరించాలి తప్ప స్వార్థానికి పదవిని ఉపయోగించకూడదు. ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగొద్దు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపించే పార్టీని ఆదరించి.. భవిష్యత్‌కు ప్రాధాన్యం ఇచ్చేవారికే ఓటు వేయాలి.

- కండే బలరాంనాయుడు, మరుపెంట, గరుగుబిల్లి మండలం

ఓటు.. మన హక్కు

(కొమరాడ)

18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయ పౌరుడికీ రాజ్యాంగం ఓటు హక్కు ప్రసాదించింది. ప్రతి ఓటరూ తమ హక్కును వినియోగించుకోవాలి. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్, మేధావులు, రాజకీయ పార్టీలు పదే పదే చెబుతుంటాయి. ఒక్కో నియోజకవర్గంలో చాలామంది ఎన్నికల బరిలో ఉంటారు. అభ్యర్థులకు ఓటు వేయడం ఇష్టం లేకపోతే చివరి వరుసలో ఉన్న నోటా బటన్ నొక్కితే సరిపోతుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారిగా కేంద్ర ఎన్నికల సంఘం నోటాకు అవకాశం కల్పించింది.



అప్పట్లో నిజాయతీపరులకే అవకాశం దక్కేది

(సాలూరు రూరల్)

పెద్దల మాట

గతంలో ఎన్నికల్లో నిజాయితీపరులకే అవకాశం దక్కేది. పోటీ చేసే వారి వ్యక్తిత్వాన్ని ప్రజలు గమనించేవారు. ఎమ్మెల్యేలు అయినా హంగు, ఆర్భాటం ఉండేవి కావు. ఓటు వేయడానికి ఉదయాన్నే పోలింగ్ బూత్‌కు నడిచి వెళ్లేదాన్ని. ఓటు వచ్చిన దగ్గర నుంచి అన్ని ఎన్నికల్లో ఓటు వేస్తున్నాను. రిక్షాలకు మైక్‌లు కట్టి అప్పుడు ప్రచారం చేసే వారు. ప్రచారానికి ఇంత కష్టపడేవారు కాదు. ఇప్పుడు ఇంటింటికి వచ్చి ఓటు అడుగుతున్నారు. ఓటరుకు ఇప్పుడు గౌరవం పెరిగింది. ప్రచార ఆర్భాటాలు పెరిగాయి. ఓటును ప్రతి ఒక్కరు వేయాలి. ఓటు వేయడానికి వరుసలో నిలబడానికి విసుగు చెందకూడదు. ఐదేళ్లకు వచ్చే ఎన్నికల్లో ఓటు వేయడానికి బద్ధకిస్తే ఎలా? అందరూ ఓటు వేయాలి. నాకు నచ్చిన వారికి ఓటు వేస్తాను.

- కోలా అచ్చియ్యమ్మ (86), సాలూరు



ఆమె ఓటే శాసనం

- ఆరు నియోజకవర్గాల్లో మహిళలే అధికం
- సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ ఆశలు
- ఆ పార్టీ వైపే మొగ్గు చూపుతున్న నారీమణులు

(రాజాం రూరల్)

విజయనగరం జిల్లా రాజకీయ పరమపద సోపాన పటంలో ఎవరికి నిచ్చెనలు ఎక్కించాలో.. ఎవరికి చట్టసభలకు పంపించాలో.. ఎవరికి అధికారయోగం కల్పించాలో.. ఈసారి మహిళలే నిర్ణయించనున్నారు. అభ్యర్థుల గెలుపు ఓటముల్లో మహిళలే కీలక పాత్ర పోషించబోతున్నారు. రాజకీయ చరిత్రను కొత్తమలుపు తిప్పబోతున్నారు. జిల్లాలో ఏడింట ఆరు నియోజకవర్గాలలో మహిళలే అధికంగా ఉన్నారు. వారి కరుణా కటాక్షాలు పొందేందుకు పార్టీలు... అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. మహిళల కోసం పార్టీలు ప్రవేశపెట్టే పథకాలు కూడా విజయంలో కీలకం కానున్నాయి. ఎన్నికలలో తమ ఓటే శాసనమని.. ఓటరు జాబితాలో నమోదైన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

జిల్లాలో..

వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మహిళా ఓటర్లు కీలకం కానున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో రాజాం మినహా విజయనగరం, బొబ్బిలి, గజపతినగరం, చీపురుపల్లి, నెల్లిమర్ల, ఎస్.కోట నియోజకవర్గాలలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఫలితాలను ప్రభావితం చేసే శక్తి స్త్రీలకే ఎక్కువగా ఉంది. మహిళలు రాజకీయ రంగంలో రాణించడమే కాకుండా ఎన్నికల సమయంలో అభ్యర్థుల అనుకూల, ప్రతికూల పరిస్థితులను కూడా లెక్కలు వేస్తున్నారు. మగువలు ఎవరివైపు మొగ్గు చూపితే వారికే అధికారం వచ్చే అవకాశం ఉంది. అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ హోరాహోరీగా ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో మహిళా ఓటర్లు ఎవరి గెలుపునకు దోహదపడతారో చూడాలి.



సూపర్ సిక్స్ పథకాలపై మహిళల మక్కువ

గతానికి భిన్నంగా టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై జిల్లా అంతటా చర్చ జరుగుతోంది. ఏ ఇద్దరు మహిళలు మాట్లాడుకున్నా బాబు అమలు చేస్తామని ప్రకటించిన పథకాలపైనే చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వం మహిళలకు ఇచ్చే నాలుగు రూపాయల కంటే.. టీడీపీ ప్రకటించిన పథకాలతో శాశ్వత ప్రయోజనం కలుగుతుందన్న వాదన జిల్లా అంతటా మహిళల్లో బలంగా వినిపిస్తోంది.

ఏడాదికి రూ.15 వేలు

స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించడంపై మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అంతమందికీ రూ.15 వేలు వంతున ఇస్తామన్న బాబు ప్రకటన మహిళల్లో కొత్త ఆలోచనకు తెరలేపింది. వైసీపీ ప్రభుత్వం సైతం ఇదే మాదిరిగా ప్రకటించినా... తొలి ఏడాదికే పరిమితం కావడంపై మహిళల్లో చర్చ కొనసాగుతోంది.

జిల్లా రాజకీయాలను మహిళలు శాసించబోతున్నారు. పార్టీల గెలుపు రాతను నారీమణులే రాయబోతున్నారు. అభ్యర్థుల విజయావకాశాలను వారే నిర్ణయించబోతున్నారు. వారి కరుణపొందిన వారే అధికారం చేపట్టబోతున్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళల ఓట్లు ఎక్కువ. వారి ఓట్లే అభ్యర్థుల బలాబలాలను నిర్ణయించబోతున్నాయి.

జిల్లాలో ఇలా..

మొత్తం ఓటర్లు:	15,41,201
పురుషులు:	7,60.400
మహిళలు:	7,80,518
థర్డ్ జెండర్:	83

జిల్లాలో మహిళా ఓటర్లు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు
విజయనగరం	1,21,235	1,28,312
గజపతినగరం	99,745	1,03,576
బొబ్బిలి	1,13,027	1,15,791
చీపురుపల్లి	1,01,574	1,01,595
నెల్లిమర్ల	1,04,676	1,06,874
ఎస్.కోట	1,07,188	1,13,117
రాజాం	1,12,955	1,11,253

ఉచిత గ్యాస్ సిలిండర్లు

ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్న తెలుగుదేశం ప్రకటన మహిళామణులకు వరంగా మారనుందన్న ప్రచారం సాగుతోంది. వైసీపీ ప్రభుత్వంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.1100 దాటిన నేపథ్యంలో మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామనడంపై మహిళలు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలలో ఉచిత సిలిండర్ల ప్రకటన కారుచీకట్లో కాంతిపుంజంలో కనిపిస్తోంది.

ఆశల పల్లకిలో యువత

యువతలో కొంగొత్త ఆశలు కనిపిస్తున్నాయి. అయిదేళ్లలో 20 లక్షల ఉపాధి అవకాశాలు, లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి కల్పించే లక్ష్యంతో టీడీపీ సిద్ధం చేసిన మేనిఫెస్టో పట్ల యువత ఆకర్షితులవుతున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితమైన నేపథ్యంలో తీవ్ర నిరాశ, నిస్పృహలో ఉన్న యువత టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారు.

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం..

మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న చంద్రబాబు ప్రకటన మహిళల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ప్రస్తుత ప్రభుత్వంలో పెట్రో ఉత్పత్తుల ధరలు ఆకాశాన్నంటిన నేపథ్యంలో ఆర్టీసీ ఛార్జీలు భారీగా పెరగడం.. ఆటో ఎక్కితే మినిమం ఛార్జీ రూ.20 పలుకుతున్న వేళ... ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణించవచ్చన్న ఆలోచన వారిలో టీడీపీ ప్రభుత్వానికి మద్దతు పలకాలన్న ఉత్సాహం నింపుతోంది. ఈసారి తెదేపా అభ్యర్థులను గెలిపించుకోవాలన్న కసి వారిలో స్పష్టంగా కనిపిస్తోంది.



నిఘాపై నిఘా

- ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు సీసీ కెమెరాలు

(శృంగవరపుకోట)

ఎన్నికల సంఘం ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు శనివారం సాయంత్రం సీసీ కెమెరాలను అమర్చింది. నిఘా అధికారులపైనే నిఘా పెట్టింది. దీంతో ఇప్పుడు ఈ నిఘా బృందాలు ఎక్కడా అలసత్వం వహించకుండా పని చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు ఎవరైనా తప్పుడు మార్గంలో వెళ్లినా ఈ సీసీ కెమెరాలు గుర్తించేస్తాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బు, బంగారం, చీరలు, ఇతర విలువైన వస్తువులు తరలించడం పరిపాటి. ఇలా రవాణా కాకుండా అడ్డుకునేందుకు నియోజకవర్గానికి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఎన్నికల సంఘం నియమించింది. ఈ వాహనాలు నియోజకవర్గ పరిధిలోని రోడ్డు మార్గంలో వేళ్లే ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలి. వీడియో గ్రాఫర్‌తో రికార్డు చేయాలి. ఇదంతా పక్కాగా జరగాలి. అయితే కొన్ని చోట్ల ఈ నిఘా అధికారులను తప్పించుకొని పారిపోవడం... వారిపై తిరగబడడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఒక పోలీసు కానిస్టేబుల్, ఒక మండల స్థాయి అధికారి, ఒక వీడియో గ్రాఫర్, వాహన డ్రైవర్ నలుగురే కావడంతో వారిని అడ్డుకోలేక అవస్థలు పడుతున్నారు. రెండు రోజుల క్రితం లక్కవరపుకోట మండలం వీరభద్రపేట వేళ్లే రోడ్డులో ఇలాంటి సంఘటన జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. అధికారులు దీనిపై కేసు నమోదు చేయలేదని తెలుస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనం ముందు భాగంలో ఎన్నికల అధికారులు సీసీ కెమెరాలను అమర్చారు. ఇది వాహనాల రాకపోకలు, వీటిని తనిఖీ చేసే విధానంతో పాటు అక్కడ జరిగే ప్రతి సంభాషణను రికార్డు చేస్తుంది. ఇదంతా కలెక్టరేట్ ఎన్నికల కంట్రోల్ రూంలో దృశ్య రూపంలో కనిపించడంతో పాటు శబ్ద రూపంలో వినిపిస్తుంది. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఏం మాట్లాడినా రికార్డవుతుంది. వాహనం దగ్గర లేకున్నా తెలిసిపోతుంది. వాహనం ఎక్కడ ఉందో సీసీ కెమెరా ద్వారా కలెక్టరేట్ ఎన్నికల కంట్రోల్ రూం అధికారులు, సిబ్బంది చెప్పగలరు. ఇప్పుడు నిఘాపై నిఘాను ఏర్పాటు చేయడంతో డబ్బు, వస్తువులు తరలించే వారితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జాగ్రత్తలు పాటించక తప్పదు.



వాహనానికి అమర్చిన సీసీ కెమెరా



వీఆర్‌పేట సమీపంలో ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనానికి బిగించిన సీసీ కెమెరా

షాపులు తెరవద్దు

- జగన్ పర్యటన కోసం పోలీసు మార్కు హుకుం
- వైసీపీ నాయకుల సేవలో వలంటీర్లు

బొబ్బిలి, ఏప్రిల్ 29: బొబ్బిలి పట్టణంలో బుధవారం ఉదయం సీఎం జగన్ నిర్వహించనున్న ఎన్నికల ప్రచార సభ కోసం పోలీసులు తమ మార్కు హుకుం జారీ చేశారు. బొబ్బిలి పట్టణంలోని శ్రీకళాభారతి ఆడిటోరియం జంక్షన్‌లో సీఎం సభ నిర్వహించనున్నారు. స్థానిక రాజా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ నుంచి సీఎం రోడ్డు మార్గంలో సభాస్థలికి చేరుకోనున్నారు. ఈ మార్గంలో గల అన్ని రకాల షాపులు, వ్యాపార సంస్థలను ఆ రోజు మూసివేయాలని పోలీసులు వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కోర్టు జంక్షన్ వరకు కుడి పక్కన గల షాపులన్నీ బొబ్బిలి రాజులకు చెందిన స్థలాల్లో ఉండడంతో వారంతా తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులుగా ఉండవచ్చని అధికార పార్టీ నాయకుల నమ్మకం. దీనితో సీఎం పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందస్తుగా వ్యాపార సంస్థల నిర్వాహకులను పోలీసులు హెచ్చరిస్తూ వాటిని మూసివేయాలని హుకుం జారీ చేశారు. దీనిపై వ్యాపారవర్గాల వారు విస్తుపోతున్నారు. సీఎం ఎన్నికల ప్రచారం కోసం వస్తే తమ షాపులు ఎందుకు మూసెయ్యాలి అని వారు ప్రశ్నిస్తున్నారు.

వలంటీర్ల సేవలు...

సీఎం జగన్ ఎన్నికల ప్రచారానికి పెద్ద సంఖ్యలో జనాన్ని తరలించేందుకు వలంటీర్ల సేవలను వైసీపీ నాయకులు వినియోగించుకుంటున్నారు. బొబ్బిలి పట్టణంలోని అన్ని వార్డులు, మండలంలోని గ్రామాలలో రాజీనామా చేసిన వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి సీఎం సభకు రావాలని ప్రజలను కోరుతున్నారు. రాజీనామాలు చేసేశారు కదా...మీకెందుకు ఈ పనులు అని నిలదీస్తుండడంతో వలంటీర్లు కంగుతింటున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోనికి రాగానే మంచి భవిష్యత్ ఉంటుందని చంద్రబాబు-పవన్‌లు భరోసా ఇస్తుంటే మళ్లీ జగన్ ఉచ్చులో పడతారేమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



షాపుల మూసివేత స్వచ్ఛందమే

సీఎం పర్యటన సందర్భంగా దారి పొడవునా గల షాపులను మూసివే యాలన్నది పూర్తి స్వచ్ఛందమే తప్ప నిర్బంధం ఏమీ లేదు. గతంలో చంద్రబాబు బొబ్బిలి పర్యటనకు వచ్చినప్పుడు షాపుల నిర్వాహకులంతా స్వచ్ఛందంగానే మూసివేశారు. ఇప్పుడు అలాగే జరుగుతోంది తప్ప.. పోలీసుల హుకుం... అధికార పార్టీ జులుం వంటివేమీ లేవు.

- నాగేశ్వరరావు, సీఐ, బొబ్బిలి

హలో.. ఓటేసేందుకు రండి



- వలస ఓటర్లపై పార్టీల దృష్టి
- ఫోన్ చేసి రప్పించేందుకు సన్నాహాలు
- స్థానిక నేతలతో సమాచారం

(గరుగుబిల్లి)


సార్వత్రిక ఎన్నికల సమరం ఊపందుకుంటోంది. పోలింగ్‌కు ఇంకా రెండు వారాలు సమయం మాత్రమే ఉండడంతో క్రమేణా గ్రామాలు రాజకీయవాతావరణంతో వేడెక్కుతున్నాయి. గెలుపునకు అధికార, ప్రతిపక్ష పార్టీల గ్రామస్థాయి నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. ఎలాగైనా గెలవాలని భావించి ప్రతి ఓటును కీలకంగా తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉపాధి లేక వలస బాట పట్టిన ఓటర్లపై పార్టీలు దృష్టి సారించాయి. దీంతో గ్రామ స్థాయిలో నాయకుల నుంచి వలస ఓటర్ల సమాచారాన్ని సేకరించి ఎన్నికల పోలింగ్ నాటికి స్వగ్రామాలకు రప్పించేందుకు సన్నాహాలు అప్పుడే ప్రారంభించారు. శాసనసభతో పాటు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ పూర్తవడంతో ప్రధాన పార్టీలు తమ అనుకూల ఓటర్ల వివరాలను స్థానిక నాయకులు, ముఖ్య కార్యకర్తలు ద్వారా తెలుసుకొని ఫోన్‌లో వారితో మాట్లాడుతూ పోలింగ్‌కు రావాలని కోరుతున్నారు. అనేక గ్రామాల నుంచి వందల సంఖ్యలో ఉపాధి కోసం నగర, పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లారు. పోలింగ్ నాటికి వస్తారో, రారో అన్న అనుమానంతో ముందస్తుగా వారికోసం ఆరా తీస్తున్నారు. ఓటుహక్కును వినియోగించుకోవడమే కాకుండా అది మనకు అనుకూలం అవుతుందన్న ఆశతో అభ్యర్థుల సూచనలతో అప్పుడే వలస ఓటర్లతో సంభాషణలు చేస్తూ వారు వచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.



జన కేతనం
ఆంధ్రజ్యోతి మంగళవారం 30 ఏప్రిల్ 2024

చరిత్రలో కలిసిపోయాయి!

- 2009లో ఐదు నియోజకవర్గాలు రద్దు
- ఉద్దండులకు చట్టసభల్లో అవకాశం
- జిల్లాలో తగ్గిన శాసనసభ స్థానాలు



(శృంగవరపుకోట)

ప్రస్తుతం విజయనగరం జిల్లాలో మనం చూస్తున్న కొన్ని నియోజవర్గాలు 2009కి ముందు లేవు. అప్పట్లో వేరే నియోజకవర్గాలు ఉండేవి. వాటిలో కొన్ని కనీసం మండల కేంద్రాలు కూడా కాని గ్రామాలు. ఉత్తరాపల్లి, సతివాడ, నాగూరు నియోజకవర్గాల పేర్లు వినే ఉంటారు. ఇలా నియోజకవర్గాల పేరు మీద ఉన్న గ్రామాలు చిన్నవి. 2009 శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనతో ఇవన్నీ రద్దయ్యాయి. వీటితో పాటు తెర్లాం, భోగాపురం నియోజకవర్గాలు తెరమరుగయ్యాయి. ఈ రెండు నియోజకవర్గాల కేంద్రాలు ప్రస్తుతం మండల కేంద్రాలుగా ఉన్నాయి. ఇలా ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఐదు శాసన సభ నియోజకవర్గాలు చరిత్రపుటల్లో కలసిపోయాయి. అంతకుముందుర 12 నియోజకవర్గాలు ఉండగా...ఆ సంఖ్య 9కి తగ్గింది. శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉన్న రాజాం నియోజకవర్గం కొత్తగా విజయనగరం జిల్లాలో చేరింది. ఈ నియోజకవర్గ పరిధిలోని రేగిడి ఆమదాలవలస మండల పరిధిలో ఉన్న ఉణుకూరు పేరు మీద ఓ నియోజకవర్గం ఉండేది. మాజీ మం త్రులు కోళ్ల అప్పల నాయుడు, పతివాడ నారాయణ స్వామి, పెనుమత్స సాంబశివ రాజు, శత్రుచర్ల విజయ రామరాజు, కిమిడి కళా వెంకటరావు వంటి ఉద్దం డులు ఈ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఉత్తరాపల్లి... శృంగవరపుకోటగా మారింది. సతివాడ, భోగాపురం.. నెల్లిమర్లగా మారాయి. నాగూరు రద్దయి కురుపాం ఆవిర్భవించింది. ఉణుకూరు స్థానంలోకి రాజాం వచ్చింది. తెర్లాం తెరమరుగై బొబ్బిలి నియోజకవర్గంగా మారింది. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఈ నియోజకవర్గాలను గుర్తుచేసుకుందాం.

సతివాడ నియోజకవర్గం



సతివాడ గ్రామం

నెల్లిమర్ల మండల పరిధిలో చిన్న గ్రామం సతివాడ. ఈ నియోజకవర్గం కూడా 1978 నుంచి 2009 వరకు కొనసాగింది. 1994 మినహా మిగిలిన అన్ని ఎన్నికల్లోనూ పెనుమత్స సాంబశివరాజు ఎన్నికవుతూ వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పలుమార్లు మంత్రిగానూ చేశారు. నెల్లిమర్ల, గుర్ల, గంట్యాడ, బొండపల్లి మండలాల్లో కొన్ని గ్రామాలతో కలసి ఈ నియోజకవర్గం ఉండేది. 2009 నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో బొండపల్లి, గంట్యాడ గజపతినగరం నియోజకవర్గంలోను, గుర్ల, నెల్లిమర్ల ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన నెల్లిమర్ల నియోజకవర్గంలోకి వెళ్లాయి.

తెర్లాం



తెర్లాం గ్రామం

తెర్లాం మండల కేంద్రం. దీని పేరు మీద 2009 వరకు నియోజకవర్గం ఉండేది. తెర్లాం, బాడంగి మండలాలతో పాటు మెరకముడిదాం మండలంలో కొంత భాగం... రామభద్రపురం మండలంలో కొంత భాగంతో కలసి 1972లో ఈ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. అత్యధిక ఎన్నికల్లో తెంటు, వాసిరెడ్డి కుటుంబాల మధ్య పోరు సాగేది. పునర్విభజనలో తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాలను బొబ్బిలి నియోజకవర్గంలో కలిపేయడంతో తెర్లాం నియోజకవర్గం కనుమరుగైంది. ఇక్కడ పోటీ పడిన రెండు కుటుంబాలూ రాజకీయంగా ప్రాధా న్యం కోల్పోయాయి. శంబంగి చినప్పలనాయుడు, బొబ్బిలి రాజుల కుటుంబాల మధ్య ఇప్పుడు రాజకీయ యుద్ధం జరుగుతోంది.

భోగాపురం నియోజకవర్గం

ప్రస్తుతం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించడంతో భోగాపురం పేరు ఖండాంతరాలు దాటుతోంది. మండల కేంద్రం కూడా. దీని పేరుతో 2009 నియోజకవర్గాల పునర్విభజన వరకు శాసన సభలో ప్రాతినిధ్యం ఉండేది. భోగాపురం, పూసపాటి రేగ, డెంకాడ మండలాలను కలుపుకొని 1955లోనే ఈ నియోజకవర్గం ఏర్పాటైంది. కొమ్మూరు అప్పుడుదొర, పతివాడ నారాయణ స్వామి వంటి నాయకులు ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. పతివాడ నారాయణ స్వామి నాయుడు రాష్ట్ర మంత్రిగానూ పని చేశారు. ఈ నియోజకవర్గం రద్దయి... పునర్విభజనలో నెల్లిమర్ల ఆవిర్భవించింది.



భోగాపురం గ్రామం

ఉత్తరాపల్లి

కొత్తవలస మండల పరిధిలో చిన్న పల్లె ఇది. 1978 నుంచి 2009 వరకు ఈ గ్రామం పేరుతో నియోజకవర్గం ఉండేది. 1978లో కె.పద్మనాభరాజు, 1983 నుంచి వరసగా 1999 వరకు కోళ్ల అప్పలనాయుడు, 2004లో పూడి మంగపతిరావు ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ మండలంలోని ఐదు గ్రామాలు, ఉమ్మడి విశాఖ జిల్లా (ప్రస్తుతం అనకాపల్లి జిల్లా)కు చెందిన కె.కోటపాడు, దేవరాపల్లి మండలంలో 3 గ్రామాలతో కలసి ఈ నియోజకవర్గం కొనసాగేది. ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన కోళ్ల అప్పలనాయుడు, పద్మనాభరాజులు రాష్ట్ర మంత్రులుగాను పనిచేసారు. 2009 పునర్విభజనతో ఉత్తరాపల్లి రద్దుకావడంతో కొత్తవలస, ఎల్.కోట, వేపాడ మండలాలు జనరల్‌గా మారిన శృంగవరపుకోటలో చేరాయి.

నాగూరు

గరుగుబిల్లి మండల పరిధిలోని కుగ్రామం నాగూరు. ఈ ఊరి పేరు మీద అర్ధ శతాబ్దానికి పైగా నియోజకవర్గ కేంద్రం ఉండేది. 1955లో ఆవిర్భవించిన ఈ నియోజకవర్గం 2009 పున ర్విభజనలో రద్దయింది. గిరిజన నియోజ కవర్గంగా ఉన్న దీన్ని రద్దు చేసి... పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో ఉన్న గరుగుబిల్లి, కొమరాడ మండలాల్లోని కొన్ని గ్రామాలను కలుపుకొని.. దాదాపుగా నాగూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న మండలాలతో కురుపాం గిరిజన నియోజకవర్గంగా మార్చారు. తొలినాళ్లలో అ డ్డాకుల లక్ష్మనాయుడు, ఆ తరువాత శత్రు చర్ల ప్రతాప్ రుద్రరాజు, వైరిచర్ల విజయ రామరాజు, నిమ్మకజయరాజు, శత్రుచర్ల విజయరామరాజు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. నియోజకవర్గం రద్దయ్యే ముందు సీపీఎంకు చెందిన కోలక లక్ష్మణమూర్తి ఈ నియోజకవర్గం నుంచి శాసన సభలో అడుగుపెట్టారు. శత్రుచర్ల విజయ రామరాజు రాష్ట్ర మంత్రిగానూ వ్యవహరించారు.

ఉణుకూరు

రేగిడి ఆమదాలవస మండల పరిధిలోని తక్కువ జనాభా కలిగిన గ్రామం. రాజాం, వంగర, రేగిడి ఆమదాలవలసలోని కొన్ని గ్రామాలతో కలసి ఉణుకూరు నియోజకవర్గం ఉండేది. 2009 పునర్విభజనలో రద్దయింది. ప్రస్తుతం ఈ గ్రామం రాజాం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో ఉంది. జిల్లాల పునర్విభజనలో శ్రీకాకుళం జిల్లా నుంచి విజయనగరం జిల్లాలో చేరింది. ఉణుకూరు నియోజకవర్గం నుంచి గెలిచిన కిమిడి కళావెంకటరావు రాష్ట్ర హోం మంత్రిగా వ్యవహరించారు. ఇది రాజాం ఎస్సీ నియోజకవర్గంగా మారడంతో ఆయన ప్రస్తుతం విజయనగరం జిల్లా చీపు రుపల్లి నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

మెజారిటీ ఓట్లు నోటాకు పోలైతే..



(చీపురుపల్లి)

ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తులలో అధికంగా ఓట్లు పోలైన వారు గెలిచినట్టు ప్రకటిస్తారు. పోలైన ఓట్లలో అత్యధికంగా నోటాకు పడితే... ఎవరు గెలుస్తారన్నది అందరిలో ఉన్న ప్రశ్న. నోటాకు ఎ క్కువ ఓట్లు పోలయ్యాయంటే.. పోటీ చేసిన వారిలో ఏ ఒక్క అభ్యర్థీ ఓటర్లకు నచ్చలేదన్నదే దానర్థం. అంటే పరోక్షంగా అభ్యర్థులందరూ ఓడినట్టే లెక్క. అదే న్యాయమని చాలా మంది అభిప్రాయ పడతారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనలు వేరే విధంగా చెబుతు న్నాయి. నోటాకు అధికంగా ఓట్లు పోలైన సందర్భాల్లో, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోకుండా... ఆ ఓట్లన్నిటినీ రద్దయినవి గానే ఎన్నికల సంఘం పరిగణిస్తుంది. నోటా తరువాత అత్యధింగా ఓట్లు పొందిన వ్యక్తిని గెలిచినట్టు ప్రకటిస్తున్నారు.

వారు సీతయ్యలు


- ఎవరి మాటా వినరు..

(రాజాం రూరల్)

అవును.. నిజమే. వారంతా సీతయ్యలే... ఎవరి మాటా వినరు.. వారు నమ్మిందే వేదం.. వారంటే కొందరికి ఇష్టం.. మరికొందరికి కష్టం. అయినవాళ్లకు అండగా ఉంటారు.. కానివాళ్లకు మాత్రం గుది బండగా తయారవుతారు. ప్రతి ఎన్నికలలోనూ వీరు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తారు. వారే సంప్రదాయ ఓటర్లు...ఎన్నికల వేళ.. వారికి ఎంతగానో ప్రాధాన్యం ఉంటుంది. నియోజకవర్గంలో తమ బలమేంటో నాయకులు లెక్కలు వేసుకున్నపుడు వీరిదే సింహభాగం. పార్టీలకు అండగా... పెట్టని కోటగా ఈ ఓటర్లే తుది ఫలితాలపై ప్రభావం చూపుతారు. అరుదైన సందర్భాలలో తప్పితే వీరి నిర్ణయంలో ఎలాంటి మార్పూ ఉండదు. ఏళ్లకు ఏళ్లు ఒకే పార్టీని నమ్ముకుంటూ ఆ పార్టీకే పట్టం కడతారు. వీరి విషయంలో దేవుడొచ్చి చెప్పినా వినరని జిల్లాలో చాలా నియోజకవర్గ నాయకులకు అనుభవమే. కుటుంబాలకు కుటుంబాలు... వీధులకు వీధులు.. గ్రామాలకు గ్రామాలు... ఒకే పార్టీకి కంచుకోటగా నిలుస్తారు.. ఈ తరహా ఓటుబ్యాంకుకు వ్యక్తిగత కారణం ఒకటైతే పార్టీపై ఉన్న అభిమానం మరొకటి. పార్టీల వల్ల, ప్రభుత్వాల వల్ల లబ్ధి పొందిన వారి శాతమూ ఎక్కువే. వీరి ఓట్లే అభ్యర్థి విజయానికి కీలకం అంటే అతిశయోక్తి కాదేమో. పదవులు పొంది... పార్టీలు మారుతున్న నేటి రాజకీయాలలో ఒక వ్యక్తినో, పార్టీనో నమ్ముకుని ఉండే ఇలాంటి సంప్రదాయ ఓటర్లకు ఉన్న విలువే వేరు...



హలో.. నన్ను గుర్తుపట్టారా?



(రాజాం రూరల్)

ఓటరు దేవుళ్లకు నమస్కారము.. మీకోసం మళ్లీ వచ్చాను.నన్ను గుర్తు [illegible] ... ఇప్పటికే అధికారులు చెప్పే ఉంటారు.. గతంలో నావల్ల ఏవో తప్పిదాలు జరిగాయని చాలామంది నన్ను తప్పుపట్టారు. అందుకే గతసారికి భిన్నంగా ఈసారి వచ్చాను. ఈసారి జాగ్రత్తగా నన్ను గమనించండి. మీరు ఏ అభ్యర్థికి ఓటు వేయాలని అనుకుంటున్నారో అతని పేరును బాగా పరిశీలించండి. ఓ నిర్ణయానికి వచ్చాక మీరు ఓటు వేయండి. మీ ఓటును మీరే వేయండి... ఇతరులకు [illegible]. మీరు మీట నొక్కినపుడు కీ అనే శబ్దం వస్తుంది. అలా శబ్దం వస్తేనే మీరు ఓటు వేసినట్లు. మరేంటా... ఉండనా మరి.. బాగా గుర్తుంచు కోండి... [illegible] మందు ఇచ్చాడనో... ఎవరో చెప్పారనో [illegible] గడచిన అయిదేళ్లూ [illegible] పోతే నాకేంటని ధీమాగా [illegible] ...ఉంటాను మరి.

ఇట్లు
= మీ ఈవీఎం

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలే

(గరుగుబిల్లి)

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ నేతలు ఆచితూచి మాట్లాడాలి. ఏమైనా తేడాగా మాట్లాడి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారా ఊచలు లెక్కబెట్టాలి. తస్మాత్ జాగ్రత్త. కొందరు అభ్యర్థులు కులం, వర్గం, మతం, ప్రాంతం పేరుతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలను అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం నియమావళిలో కఠిన నిబంధనలు రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మత, కుల, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఆర్పీ చట్టం 1951 సెక్షన్, 125 ఐపీసీ సెక్షన్, 153 ఐపీసీ ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ఓటు కోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను తీసుకున్న వారిని కూడా నేరస్తులుగా పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్ 171బి, 171ఇ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలు శిక్ష విధిస్తారు. ప్రస్తుత ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రవాహంపై నిఘా పెంచారు. నజారాలకు లొంగినా... ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా భారీ మూల్యం చెల్లించక తప్పదు.



రాజకీయ కట్టప్పలు



- అభ్యర్థుల్లో గుబులు
- ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి

(కొమరాడ)

ఎన్నికల వేళ నేతలకు సరికొత్త చిక్కు వచ్చిపడింది. నిన్న మొన్నటి వరకు ప్రత్యర్థి పార్టీలో ఉన్న నేతలు ఇప్పుడు సొంతవారయ్యారు. ఇంతవరకు బాగానే ఉన్నా నేతలకు ఇప్పుడు కోవర్ట్‌ల భయం పట్టుకుంది. స్వపక్షంలోనే ఉండి పనిచేసే కన్నా ప్రత్యర్థి వర్గంలోకి చేరి వారి అనుపానులను చేరవేయడం ఓ రాజకీయం. స్వపక్షంలోనే కొనసాగుతూ వారి వ్యూహాలను ప్రత్యర్థి పార్టీకి చేరవేయడం మరో కోవర్టు కళ. రాజకీయ పార్టీల గెలుపు ఎత్తుల్లో ఇది కూడా ఓ వ్యూహమే. పార్టీలోకి వచ్చే వారిని కాదనలేరు. అలా అని అందరినీ కోవర్టులుగా చూడలేరు. ఒకరిద్దరు మాత్రం ఈ తరహా వ్యక్తులు కచ్చితంగా ఉంటారని నేతలే నమ్ముతున్నారు. ఒకవిధంగా వీరంతా రాజకీయ కట్టప్పలు. ఎప్పుడు వెన్నుపోటు పొడుస్తారో చెప్పలేం. వచ్చిన చిక్కల్లా ఆ కోవర్టులను ఎలా పసిగట్టడం అనేది మాత్రమే. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ప్రత్యర్థుల శిబిరాల్లో కోవర్టులను ఇప్పటికే మోహరించాయి. వీరి ద్వారానే తమ దగ్గర ఉన్న కోవర్టుల పేర్లు తెలుసుకునే సరికి అవాక్కవడం వారి వంతవుతోంది. ఫలానా వ్యక్తి కోవర్టు అని తెలిసినా బహిరంగంగా అది వెలిబుచ్చలేని వింత పరిస్థితి నేతలది. ఎందుకంటే ఇది ఎన్నికల వేళ కనుక ప్రతి ఓటు, ప్రతినేత విలువైన వారే. దీంతో వారిని పార్టీలోనే ఉంచుతూ... వారి విషయంలో జాగ్రత్త వహిస్తూ ఎన్నికల కార్యం జరిపించుకోవడమే ప్రస్తుతం నేతల ముందు ఉన్న తక్షణ కర్తవ్యంగా భావిస్తున్నారు.

నేతల్లో టెన్షన్

రాజకీయం అంటేనే ఎదుటి వారి బలాలు, బలహీనతలు తెలుసుకుని వాటికి అనుగుణంగా గెలుపు వ్యూహాలు రచిస్తూ ఉంటాయి. కానీ నిన్న మొన్నటి వరకు తమ వెంట తిరిగిన వారు ఇప్పుడు ఆవలి పక్షాన కనబడుతుండే సరికి వారిలో టెన్షన్ అధికమవుతోంది. వారి లోగుట్టులన్నీ ఆ నేతలకు తెలిసి ఉండడమే అందుకు కారణం. తన అంతరంగీకులుగా మెలిగే ఒకరిద్దరు నేతల వద్ద మాత్రమే ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన వివరాలు పంచుకుంటున్నారు. గోడలకు చెవులు ఉండొచ్చు అనే చందాన అత్యంత రహస్యంగా ఎన్నికల ప్రణాళికలకు పదును పెడుతూ కోవర్టు రాజకీయాలకు చెక్ పెట్టాలనే తలంపుతో నేతలు ఉన్నారు.

భలే అవకాశవాదం

కోవర్ట్‌లకు మరో అవకాశం కూడా ఉంది. ప్రత్యర్థి పార్టీ ప్రయోజనాల కోసం పనిచేసినా.. సొంత పార్టీ గెలిస్తే గుట్టుచప్పుడు కాకుండా ఈ విజయం క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకుని ఎంచక్కా ఆ నేత నీడలోనే ఉండొచ్చు. ఇలా కాకుండా ఎవరికోసమైతే కోవర్టు అవతారమెత్తారో వారే గెలిస్తే దర్జాగా మళ్లీ వారి దగ్గరకు వెళ్లిపోయి అక్కడా గెలుపు క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకునే సౌలభ్యం కోవర్టులకు మాత్రమే ఉంది.

అందరూ మంచివారే.. కానీ

అధికార పార్టీ మీద అసంతృప్తితో పాటు ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగానో, పార్టీల ఏకపక్ష ధోరణి నచ్చకనో పార్టీలు మారడం సహజం. ఇలా మారే వారిలో చాలామంది నిజంగా నిండు మనసుతో పార్టీ మారేవారే. కానీ ఒకరిద్దరు మాత్రం కోవర్టు రాజకీయం చేస్తుంటారు. ఈ మొత్తంలో వారిని పసిగట్టడమే పార్టీలకు పెద్ద పరీక్ష. ఒక్కోసారి నిబద్ధత కలిగిన నేతను విస్మరించి... కోవర్టుకే పెద్ద పీట వేసే నేతాగణానికీ కొదవలేదు. అందుకే నేతలూ కోవర్టులతో బహుపరాక్..

కోవర్టులు రకరకాలు

ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు వివిధ రకాలుగా కోవర్ట్ ఆపరేషన్ చేపడుతుంటాయి. వాటిలో ముఖ్యంగా ప్రత్యర్థి శిబిరంలోనే ఉంచి దెబ్బతీయడం. ఇటీవల ఓ అభ్యర్థి వద్దకు ద్వితీయ శ్రేణి నేత ఒకరు తాను ప్రస్తుతం ఉన్న పార్టీని వదిలేసి మీ గూటికి వస్తానని వర్తమానం పంపారు. ఆ అభ్యర్థి మాత్రం పార్టీ మారేకంటే అక్కడే ఉండి వారి పథక రచనలన్నీ తనకు చేరవేయాలని... ఇదే తనకు చేసే మేలు అని చెప్పారు. అంతే అటు పార్టీ మారినట్లయింది. ఇటు కోవర్ట్ ఆపరేషన్ మొదలయ్యింది. ఆవల శిబిరంలోకి వెళ్లి వారి నేతలు, కార్యకర్తలతో మమేకమైపోయి... వారి వ్యవహారాలన్నీ గుట్టు చప్పుడు కాకుండా తన సొంత శిబిరం నేతలకు చేర్చడం ఇదో రకం కోవర్టు వ్యవహారం. వీరు తటస్థంగా ఉన్నట్లు కలరింగ్ ఇస్తూ ఏదో ఒక పక్షానికి లోపాయికారిగా పనిచేస్తారు. పోలీసులు నేరుగా డబ్బు ఉన్న చోటుకు వెళ్లి కొన్ని సందర్భాల్లో దాడులు చేస్తుంటారు. ఇదంతా ఈ తటస్థ కోవర్టుల పుణ్యమే. ఇలా కోవర్టులందు రకాలు వేరయా అన్న చందాన వీరితో పెను ప్రమాదం కూడా అభ్యర్థులకు పొంచి ఉందండోయ్.



ప్రజా సంక్షేమం, అభివృద్ధి గాలికే: అదితి


ప్రచారంలో భాగంగా ఆశీర్వాదం తీసుకుంటున్న అదితి

విజయనగరం రూరల్, ఏప్రిల్ 29: ఐదేళ్ల వైసీపీ పాలనలో ధరలు.. పన్నులు.. చార్జీలు.. అప్పులు తప్ప.. ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేశారని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏనిమిదో డివిజన్ పరిధిలోని కోట, బొంకులదిబ్బ, గురాచారి వారి వీధి, పత్తిపాటి వారి వీధి, లంకవీధి, దక్షిణగట్టు తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. పెద్దవయస్సు వారి బయటకు వచ్చి అదితిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు, ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు క్రమ, క్రమంగా ఐదేళ్లు పెంచి, రాష్ట్ర ప్రజలపై భారం మోపారన్నారు. మే నెల 13న జరగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై రెండు ఓట్లను వేసి, గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ద్వాదశి సుమతి, ద్వాదశి వేణు, నంబూరి నాగమణి, సి.లక్ష్మీదేవి, ఎం.లక్ష్మీనరసింహరాజు, నమ్మి ప్రసాద్, గుంటుబోయిన ప్రసాద్, బమ్మిడి రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ● ఒక్క ఛాన్స్ అంటూ జగన్ ప్రజలను నట్టేట ముంచారని, ప్రజలు ఆలోచించి వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు చెప్పారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని గొల్లలపేట, గుండాలపేట గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆమె మాట్లాడారు. ఒక్క ఛాన్స్ ప్రజలు ఇవ్వడంతో రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలు ఇబ్బందుల్లోకి తీసుకువెళ్లారన్నారు. టీడీపీ నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, ఈగల సత్తిబాబు, కంది సాయి జగ్గారావుతో పాటు ఆయా గ్రామాల టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటుతోనే బుద్ధి చెప్పాలి: కోండ్రు

రాజాం: వచ్చే ఎన్నికల్లో ఓటుతోనే వైసీపీకి బుద్ధి చెప్పాలని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. సోమవారం సంతకవిటి మండలం చింతలపేట, మల్లయ్యపేట, రామరాయపురం, మంతెన, గెడ్డబూరాడపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఒక్క అవకాశం అంటూ వచ్చిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని, అటువంటి వ్యక్తికి మళ్లీ ఓటువేసి మోసపోవద్దని హితవు పలికారు. తెలుగుదేశం పాలనలో సాగునీటి ప్రాజెక్టులకు రూ.68వేల కోట్లు ఖర్చుపెట్టామని, 64 ప్రాజెక్టుల్లో 24 పూర్తిచేసి జాతికి అంకితం చేశామన్నారు. ఈ ముఖ్యమంత్రికి ప్రజలంటే భయంలేదన్నారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చి ఉండుంటే సాగునీటి సమస్య ఉండేది కాదని, పోలవరం పూర్తయ్యేదని, రాష్ట్రమంతా సస్యశ్యామలం అయ్యేదన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, ఏ వర్గం కూడా సంతోషంగా బతకలేపోయిందని, ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చూపించగల సత్తా కలిగిన ఏకైక నాయకుడు చంద్రబాబునాయుడు అని, అటువంటి వ్యక్తిని ముఖ్యమంత్రిని చేయాలంటే సైకిల్ గుర్తుకు ఓటువేసి వైసీపీని ఇంటికి సాగనంపాలని కోండ్రు కోరారు. కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకుడు కొళ్ల అప్పలనాయుడు, గట్టి భాను, వల్లూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్నకోండ్రు మురళిమోహన్

నెల్లిమర్లను ఆదర్శంగా తీర్చిదిద్దుతా: నాగమాధవి


ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి

డెంకాడ: నెల్లిమర్ల నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కూటమి నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి అన్నారు. డెంకాడ మండలంలోని చింతలవలస, రఘుమండ, మోదవలస, మోపాడ పంచాయతీల్లో ఆమె సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గత ఐదేళ్లుగా ఎప్పుడైనా ప్రజా క్షేత్రంలో కనిపించారా.. ప్రజల సమస్యలను పట్టించుకున్నారా.. అని ప్రశ్నించారు. యువతకు ఆర్థిక సుస్థిరత కల్పించేలా తాను అడుగులు వేస్తానని, శ్రీరామ తీర్థసాగర్ ప్రాజెక్టును పూర్తి చేసి సంవత్సర కాలంలోనే ప్రతి ఇంటికి తాగునీరు, సాగునీరు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి, తనను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకపడిందని, వైసీపీని ఓడిస్తేనే రాష్ట్రం ముందుకు వెళ్తుందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారా యణ, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, విజయనగరం పార్లమెంటరీ సెక్రటరీ కలిదిండి పాణి రాజు, మండల ఉపాధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు, జనసేన మండల కోఆర్డినేటర్ పైల శంకరరావు, ఉత్తరాంధ్ర మహిళ రీజనల్ కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీరాజ్, పిన్నింటి రాజారావు, వీర మహిళ అట్టాడ ప్రమీల తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

3న బాలకృష్ణ ఉత్తరాంధ్ర పర్యటన

విజయనగరం రూరల్: సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎన్నికల ప్రచార కార్యక్రమం ఖరారైంది. ఇప్పటికే రాయలసీమలో పర్యటన ముగించుకున్న ఆయన మే 2న రాత్రి విశాఖకు చేరుకుంటారు. 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఎంపిక చేసిన కొన్ని నియోజకవర్గాల్లో బాలకృష్ణ ప్రచార సభలు నిర్వహించనున్నారు.

ఉచిత పుస్తక పంపిణీ

విజయనగరం రింగురోడ్డు: మహాకవి గురజాడ అప్పారావు స్వగృహంలో సహజ సాంస్కృతిక సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత పుస్తక పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రధాన కార్యదర్శి దయానంద్ అన్నారు. గురజాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన ఉచిత పుస్తక వితరణ కార్యక్రమం సోమవారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రేమికుల కోసం పుస్తక వితరణ చేయడం అభినందనీయమన్నారు.

జీఎంఆర్ఐటీలో వేసవి శిక్షణ

రాజాం: స్థానిక జీఎంఆర్ఐటీలో వేసవి శిక్షణ శిబిరం మే 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తారని జీఎంఆర్ఐటీ ప్రిన్సిపాల్ ప్రసాద్, పీడీ అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 15 సంవత్సరాల బాల బాలికలకు బ్యాడ్మింటన్, చెస్, ఫుట్‌బాల్, క్రికెట్, అథ్లెటిక్స్ రంగంల్లో ఉదయం, సాయంత్రం శిక్షణ ఉంటుందని, వివరాలకు 98661 63076, 9542027972 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం

శృంగవరపుకోట: శృంగవరపుకోట కేంబ్రిడ్జి నారాయణ పాఠశాలలో మే 1 నుంచి 31 వరకు నెలరోజుల పాటు వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిభిరంను నిర్వహిస్తున్నట్లు చీఫ్ కోచ్ పోట్నూరు శ్రీరాములు తెలిపారు. 7 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల బాల బాలికలకు శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 6 నుంచి 7.30 వరకు, సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు శిక్షణ వుంటుందన్నారు.

సందేహాలను నివృత్తికి చేసుకోండి

శృంగవరపుకోట: సార్వత్రిక ఎన్నికల సందేహాలకు జనరల్ అబ్జర్వర్ సీతారాం జాట్‌ను సంప్రదించాలని శృంగవరపుకోట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఇతను ఈ నియోజకవర్గంతో పాటు విశాఖ వెస్ట్, గాజువాక నియోజకవర్గాలకు అబ్జర్వర్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు 63003 20829 నెంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడవచ్చన్నారు.

రామభద్రపురానికి జూనియర్ కళాశాల

రామభద్రపురం: మండల కేంద్రంలో రానున్న విద్యా సంవత్సరం నుంచి నూతనంగా ప్రభుత్వ కళాశాల మంజూరు చేశామని డిప్యూటీ డీఈవో మోహన్‌రావు తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్‌లో ఎక్కువ మంది విద్యార్థులు ప్రవేశించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి మొండిచేయి

రామభద్రపురం: ఉత్తరాంధ్ర అభివృద్ధికి పాలకులు మొండిచేయి చూపారని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమురెడ్డి లక్ష్మంనాయుడు ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ విశాఖపట్టణం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతాలుగా మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మనకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే కానీ ఈ సమస్య పరిష్కారం కాదని ఆయన అన్నారు.

ఇంటివద్దే పింఛన్ అందించాలి

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం మే నెల పెన్షన్‌ను ఇంటివద్దే అందించాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు భవిరెడ్డి శివప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం లయన్స్‌క్లబ్ వద్ద వున్న ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల ఎండలు తీవ్రంగా ఉన్నాయని, వెంటనే చర్యలు తీసుకుని పింఛన్ అందించాలన్నారు.

విద్యాకానుక కిట్లు అందించాలి: డీఈవో

వంగర: పాఠశాలల ప్రారంభానికి ముందుగానే విద్యాకానుక కిట్లు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. సోమ వారం వంగర జడ్పీ పాఠశాలలో విద్యాకానుక కిట్లు బద్రపరచటానికి ఉపయో గించిన గదులను పరిశీలించారు. జిల్లా కేంద్రం నుంచి రెండురోజుల్లో కిట్లు సర ఫరా కానున్న నేపథ్యంలో వచ్చిన వాటిని బద్రపరచాలన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

వంగర: వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేవరకూ ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా పోలీసు పరిశీలకులు సచ్చిదానంద పటేల్ విజ్ఞప్తిచేశారు. సోమవారం సమస్యాత్మక లక్ష్మీపేటలో పర్యటించారు. సీఐ శ్రీనివాసరరావు, ఎస్సై జనార్దనరావు ఉన్నారు.

గిరిజన హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

రాజాం రూరల్: గిరిజనుల హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏపీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డా.డి.వి.జి. శంకర్రావు హెచ్చరించారు. గిరిజనుల సంక్షేమానికి కమిషన్ కట్టుబడి పని చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. రాజాంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఏవీపురం హైస్కూల్ తనిఖీ

రేగిడి: హైస్కూల్లో ఇంటర్ మీడియట్‌విద్యకు జిల్లాలో ఆరు ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా ఎంపిక చేయగా, వీటిలో రేగిడి మండలం అంబాడ వెంకటాపురం హైస్కూల్‌నూ ప్రభుత్వం గుర్తించింది. ఈపాఠశాలను సోమవారం డీఈవో ప్రేమ్‌కుమార్ సందర్శించారు.

మోసపూరిత వాగ్దానాలు నమ్మవద్దు: బేబీనాయన


మాట్లాడుతున్న బేబీనాయన

రామభద్రపురం, ఏప్రిల్ 29: రాష్ట్రంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒక్కచాన్సు పేరుతో వెయ్యి తప్పులు చేసి రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని బొబ్బిలి కూటమి అసెంబ్లీ అభ్యర్థి బేబీనాయన ఆరోపించారు. మండలంలోని రావివలస పంచాయతీలో ఉన్న ఆర్.చింతలవలస, ఎనుబరువు, పెదశెలగాం గ్రామాల్లో ఆయన సోమవారం సుడిగాలి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అయిదు సంవత్సరాలుగా ఈ ప్రాంత పాలకులు గిరిజన సమస్యలపై నిర్లక్ష్యం వహించడంతో గిరిజనులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రన్నారు. తెలుగుదేశం పార్టీనాయకులు చింతల రామకృష్ణ, మడక తిరుపతినాయుడు, కర్రోతు తిరుపతిరావు, మాజీ ఎంపీపీ బోయిన లూర్థమ్మ, రావివలస మాజీ సర్పంచ్ జైరావు, ఎంపీటీసీ సభ్యులు భవిరెడ్డి చంద్ర, వసంతుల తిరుపతిరావు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ● ప్రచార సభల్లోనే సామాన్య మనుషులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య సోమవారం చెట్టుకింద బేబీనాయన అల్పాహారం చేయడం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. రాజవంశీయులు అయినప్పటికీ సామాన్య ప్రజలతో బేబీనాయన మమేకం అవ్వడం స్థానికులను ఆకట్టుకుంది.

వైన్‌షాపులకు బ్రాండెడ్ మద్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


నగరంలోని వైన్‌మార్ట్‌కు లారీ నుంచి మద్యం దించుతున్న కూలీలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి) ఏప్రిల్ 29: జిల్లాలోని మద్యం షాపులకు, అబ్కారీ శాఖ బ్రాండెడ్ మద్యాన్ని సరఫరా చేసింది. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఓ అధికారికి కాసులే కాసులు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. బ్రాండెడ్ మద్యం బార్లకు తరలింపుపై ఆరా తీసినట్లు తెలిసింది. వెంటనే ప్రభుత్వ మద్యం షాపులకు బ్రాండెడ్ మద్యం సరఫరా చెయ్యాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతో సంబంధిత అధికారి సోమవారం ప్రభుత్వ వాకిన్‌స్టోర్, మద్యం షాపులకు బ్రాండెడ్, సామాన్యులు సేవించే మద్యాన్ని సరఫరా చేశారు.

● విజయనగరం క్రైమ్: జిల్లాలోని ప్రభుత్వ మద్యంషాపుల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే విక్రయాలు జరుగుతున్నాయని జిల్లా ఎక్సైజ్ అధికారి ఎన్‌వీ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికల్లో సోమవారం ప్రచురితమైన వార్తపై ఎక్సైజ్ జిల్లా అధికారి స్పందించారు.

1 నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ

విజయనగరం రింగురోడ్డు: రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్న కారణంగా మే, జూన్ నెలలకు సంబంధించి నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న పెన్షన్‌దారులకు పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ మల్లయ్యనాయుడు తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. **రామభద్రపురం:** మే 1 నుంచి పెన్షనుదారులకు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందిం చాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయ ఉద్యోగుల సమావేశం మండల అభివృద్ధి అధికారి ఈశ్వరమ్మ తెలిపారు. ● **రాజాం:** దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వార్డు సచివాలయం ఉద్యోగులతో నేరుగా వారి ఇంటికే పింఛన్ పంపిణీని మే 1 నుంచి చేపడ్తామని పురపాలక సంఘం కమిషనర్ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ● **నెల్లిమర్ల:** ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా మే, జూన్ నెలలకు సంబంధించి పింఛన్ సొమ్ము పంపిణీకి ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసిందని ఎంపీడీవో జి.రామారావు తెలిపారు.

రామభద్రపురం: మిర్తివలస గ్రామంలో ప్రచార సభలో పాల్గొన్న కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి బేబీ నాయన



జిల్లా ఓటర్లు వీరే..

● పురుషుల కంటే మహిళలు 21,233 అధికం

కలెక్టరేట్; ఏప్రిల్ 29: జిల్లాలో వచ్చే నెలలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ తుది ఓటర్ల జాబితా విడుదల చేసింది. ఆ ప్రకారం జిల్లాలో 15,62,921 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 7,70,805, మహిళలు 7,92,038, థర్డ్ జండర్ 78 మంది ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 21,233 మంది అధికంగా ఉన్నారు. జిల్లాలోని విజయనగరం నియోజకవర్గంలో అత్యధికంగా ఓటర్లు ఉండగా గజపతినగరం నియోజకవర్గంలో అత్యల్పంగా ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
రాజాం	1,14,494	1,12,990	19	2,27,503
బొబ్బిలి	1,14,216	1,17,006	10	2,31,232
చీపురుపల్లి	1,02,627	1,02,847	10	2,05,484
గజపతినగరం	1,00,799	1,04,667	5	2,05,471
నెల్లిమర్ల	1,05,613	1,07,935	3	2,11,553
విజయనగరం	1,24,829	1,32,347	29	2,57,205
ఎస్.కోట	1,08,227	1,14,246	2	2,22,475
మొత్తం	7,70,805	7,92,038	78	15,62,921

కూటమితో అన్ని సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న కళావెంకటరావు

చీపురుపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని చీపురుపల్లి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు అన్నారు. మండలంలోని దేవర పొదిలాం, చొక్కరపాలెం, చిననడిపల్లి తదితర గ్రామాల్లో ఆయన సోమవారం ప్రచారం నిర్వహించారు. అనంతరం చిననడిపల్లిలో యాదవ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 50 కుటుంబాలు టీడీపీలో చేరగా, వారిని ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ ప్రచారంలో టీడీపీ నాయకులు కె.త్రిమూరులరాజు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, కరణం మురళి, మహంతి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

వేపాడ: రాష్ట్రంలో జగన్‌రెడ్డి రాక్షస పాలనకు రోజులు దగ్గర పడ్డాయని శృంగవరపుకోట నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి జోస్యం చెప్పారు. మండలంలోని సోంపురం, అరిగిపాలెం, ఆతవ గ్రామాల్లో సోమవారం రాత్రి ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రిగా జగన్ చేపట్టిన సంక్షేమం ఏం లేదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ ఎంపీగా శ్రీభరత్, ఎమ్మెల్యేగా తనకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి ఘనవిజయం చేకూర్చాలని పిలుపునిచ్చారు.

టీడీపీ ప్రచారం

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో సోమ వారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ మేనిఫెస్టోను వివరించారు. మాజీ వైస్‌ఎంపీపీ నానిగిరి రమణాజీ, భీశెట్టి అరుణ తదితరులున్నారు.

గజపతినగరం: మండలంలోని కెంగువ, రంగుపురం, ముచ్చర్ల, కొత్తవలస, లింగాలవలస, లోగిస తదితర గ్రామాల్లో కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు అట్టాడ లక్ష్మునాయుడు, గంట్యాడ శ్రీదేవి, మాజీ జడ్పీటీసీ మక్కువ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గరివిడి(మెరకముడిదాం): మెరకముడిదాం మండలంలోని రామాయవలస గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. సోమవారం సాయంత్రం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో చీపురుపల్లి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ● **రేగిడి:** జగన్ అరాచపాలనకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని మండల టీడీపీనేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, మజ్జి శ్రీనివాసరా వు తది తర్లు ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలో చిన్నశిర్లాం, పెద్దశిర్లాం, రెడ్డి పేట, మీసాల డోలపేట, సంకిలి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ● **గుర్ల:** పెదబంటు పల్లి గ్రామంలో గ్రామ వైస్ సర్పంచ్ పడాల చెల్లయ్య, రౌతు పేట ఉప సర్పంచ్ కంకణాల పెద్దయ్యలతోపాటు వందమంది టీడీపీలో చేరారు.

రాజాం నియోజకవర్గానికి అడ్‌హక్ కమిటీ

రాజాం: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రాజాం నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో సమన్వయం కోసం అడ్‌హక్ కమిటీని నియమిస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుందని, అందులో కొంత మంది పార్టీ ఆదేశాలను దిక్కరించినందుకు తొలగించిందని నియోజకవర్గ జనసేన నాయకులు ఉర్లాపు పోలిరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

బీఎస్సీ పారా మెడికల్ ఫలితాల్లో బొల్లినేని విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం: వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం విడుదల చేసిన బీఎస్సీ పారా మెడికల్ ఫలితాల్లో బొల్లినేని కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎనస్తీషియా విభాగంలో ప్రథమ ర్యాంకర్‌గా నిలిచిన ఎస్.ఛటోపాధ్యాయను కళాశాల యాజమాన్యం సోమవారం అభినందించింది. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. డయాలసిస్ విభాగంలో కళాశాల విద్యార్థి కోరాడ తరుణ్ కుమార్ యూనివర్శిటీ స్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించారన్నారు. ఈ పరీక్షల్లో 61 మంది విద్యార్థులకు గాను 11 మంది డిస్టింక్షన్‌లో, 44 మంది ప్రథమ శ్రేణి, ముగ్గురు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన వారికి బీఎస్సీ, డిప్లమో పారామెడికల్, జీఎన్ఎమ్, బీపీటీ కోర్సుల్లో, ఇంటర్ ఫెయిల్ అయిన వారికి ఓటి అసిస్టెంట్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

భోగాపురం: రాజాపులోవ గ్రామానికి చెందిన ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై ఎస్ఐ వి.సూర్యకుమారి సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపులోవ గ్రామానికి చెందిన ఓ బాలిక(17) ఇంటర్ చదువుతూ ఈ ఏడాదే ప్రథమ సంవత్సర పరీక్షలు రాసి, ఫెయిల్ అయింది. అయితే ఈమె తండ్రి కొన్నేళ్ల కిందట ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. తల్లి ఆ బాలికకు సుమారు మూడేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిపించింది. అయితే రెండేళ్ల కిందట పెద్దల సమక్షంలో వారు విడిపోయారు. ఇటీవల బాలిక తల్లి ఆ అబ్బాయి మంచివాడని అతనితోనే జీవితం కొనసాగించాలని చెబుతూ వస్తోంది. దీంతో బాలిక తనకు అతను ఇష్టంలేదని తల్లికి చెబుతూ వస్తోంది. ఈనేపథ్యంలో మనస్తాపానికి గురైన బాలిక ఈనెల 23న ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సూర్యకుమారి తెలిపారు.

వంతెన కింద మృత శిశువు

మెంటాడ: మండలంలో ఆండ్ర గ్రామానికి సమీపంలోని చంపావతి బ్రిడ్జి కింద సోమవారం నెలలు నిండని శిశువు మృతదేహం కలకలం రేపింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఆండ్ర ఎస్ఐ బి.దేవి అక్కడికి చేరుకుని, ఈ మృత శివువును ప్రైవేటు అంబులెన్స్ ద్వారా పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మద్యం సీసాలు స్వాధీనం

గజపతినగరం: అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యు.మహేష్ సోమవారం తెలిపారు. లింగాలవలస గ్రామానికి చెందిన బొత్స సత్యనారాయణ వంద మద్యం సీసాలను తీసుకు వెళ్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఫ్లైయింగ్ స్కాడ్ సిబ్బంది కేఎస్ఆర్ పురం వద్ద మాటువేసి పట్టుకున్నారు. పట్టుబడిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశారు.

అగ్ని ప్రమాదంలో పశువుల శాల, గడ్డివాములు దగ్ధం

నెల్లిమర్ల: ఒమ్మి గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన దుర్గాసి ఎర్రంనాయుడుకు చెందిన పశువుల శాల, రెండు గడ్డి వాములు, రెండు ఎడ్ల బండ్లు, టేకు కలప, ప్లాస్టిక్ పైపులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.3.5లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని బాధితుడు తెలిపారు. వాటితో పాటు పక్కనే ఉన్న మరో రెండు ఇళ్లు కూడా పాక్షికంగా దెబ్బతిన్నట్లు గ్రామస్థులు చెప్పారు. విషయం తెలుసుకున్న విజయనగరం అగ్నిమాపక దళ సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనా స్థలాన్ని రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు.